క్లుప్తంగా

రోడ్లు శుభ్రంగా ఉంచాలి



రేచర్లలో చెత్త సేకరణపై అవగాహన కలిగిస్తున్న అనురాధ

చింతలపూడి : గ్రామంలో తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలని జిల్లా పంచాయతీ అధికారిణి కె.అనురాధ ఆదేశించారు. బుధవారం చింతలపూడి మండలం రేచర్ల గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను డీపీఓ పరిశీలించారు. పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో రోడ్ల పక్కన చెత్త కుప్పలు లేకుండా శుభ్రం చేయాలన్నారు. అనంతరం వర్మి కంపోస్ట్ ప్రాసెస్ యూనిట్లను డీపీఓ పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ జీఎం రత్నకుమార్, సర్పంచ్ కె.శివరామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

నిప్పులగుండం తొక్కిన భక్తులు



నిప్పుల గుండాన్ని తొక్కుతున్న భక్తులు

ద్వారకాతిరుమల: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని గుండుగొలనుకుంట కండిగలమ్మ, పోతురాజు స్వామి ఆలయం వద్ద బుధవారం రాత్రి నిప్పులగుండం ఏర్పాటుచేశారు. కుంకుళ్లమ్మ, భవానీ దీక్షాధారులు, భక్తులు పాల్గొన్నారు. తొలుత వారంతా కండిగలమ్మ, పోతురాజుల చిత్రపటాలకు విశేష పూజలు చేశారు. అనంతరం స్నానాలు ఆచరించి, భక్తి ప్రపత్తులతో నిప్పులను తొక్కారు. ఆలయ నిర్వాహకుడు చిలుకూరి ధర్మారావు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

క్షేత్రంలో భవానీ దీక్షాధారులు



కుంకుళ్లమ్మ ఆలయంలో భవానీ భక్తులు

ద్వారకాతిరుమల: భవానీ దీక్షాధారులు విజయవాడ దుర్గమ్మను దర్శించి, తిరుగు ప్రయాణంలో ద్వారకాతిరుమల క్షేత్రానికి విచ్చేశారు. దీంతో క్షేత్ర పరిసరాలు ఎరుపెక్కాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, నిత్యాన్నదాన సదనం పరిసర ప్రాంతాలు దీక్షాధారులతో కళకళలాడాయి. వారు క్షేత్ర దేవత కుంకుళ్లమ్మవారిని దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న వాసుదేవరావు

పోలవరం రూరల్: ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారిని ఉన్నత స్థాయికి తీసుకురావడానికి కృషి చేయాలని ఏలూరు జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ చక్కా వాసుదేవరావు అన్నారు. పోలవరం మండల పరిషత్ కార్యాలయంలో పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్స్ (పీ4) కార్యక్రమంపై సచివాలయ సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ పీ–4 కార్యక్రమం పేదలకు ఎంతో దోహదపడుతుందన్నారు. తహసీల్దార్ ఆర్ఎస్ రాజు, ఇన్‌చార్జి ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసబాబు, ఎల్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 47 మంది ఎంపిక

జంగారెడ్డిగూడెం: ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శ్రీరామచంద్ర జూనియర్ కళాశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో దాదాపు 132 మంది పాల్గొన్నారని శ్రీరామచంద్ర గ్రూపు సంస్థల చైర్మన్ బీవీ కృష్ణరావు తెలిపారు. వీరిలో 47 మంది వివిధ కంపెనీలకు ఎంపికైనట్టు చెప్పారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డిస్ట్రిక్ట్ డీపీఓ ప్రవీణ్, వివిధ కంపెనీల ప్రతినిధులు, శ్రీరామచంద్ర గ్రూపు సంస్థల ఏవో రమేష్, డిగ్రీ, ఇంటర్ ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): షెడ్యూల్ కులాలకు స్వేచ్ఛగా రాజ్యాధికారం చేసుకునే అవకాశం కోల్పోయారన్న విషయం చరిత్ర చెబుతుందని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మెండెం సంతోష్ కుమార్ అన్నారు. ఏలూరులో ఎస్ఆర్‌పీఎస్ఎస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 1932 సెప్టెంబర్ 24న పూణేలో ఎరవాడ జైల్లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్, మహాత్మాగాంధీకి జరిగిన రిజర్వేషన్లు ఒప్పందమే ఈ పూన వడంబడిక అన్నారు. సమావేశంలో ఎన్ఏడీ పాల్, కొరబండ బాబురావు, స్వరూప రాణి, కంచర్ల వాణి, పెరియార్ నాగరాజు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో 'భౌ'బోయ్



వీధి కుక్కల మధ్య నుంచి వెళ్లేందుకు జంకుతున్న మహిళలు



ప్రయాణికులతో నిండిపోయిన కుర్చీలు



కుర్చీలు చాలక ప్లాట్‌ఫామ్‌పై కూర్చున్న యాత్రికులు

- వీధి కుక్కల సంచారం
- వాటిని చూసి భీతిల్లుతున్న యాత్రికులు
- వైరస్ సోకిన శునకాలతో భయం భయం
- శ్రీవారి క్షేత్రం బస్టాండ్‌లో సౌకర్యాలు కరువు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల బస్టాండ్‌లో వీధి కుక్కలు యాత్రికులను హడలెత్తిస్తున్నాయి. ముఖ్యంగా వైరస్ సోకిన శునకాలు వణుకు పుట్టిస్తున్నాయి. వాటిని దాటుకుని వెళ్లేందుకు యాత్రికులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన కూటమి ప్రభుత్వం, బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందని ప్రయాణికులు ధ్వజమెత్తుతున్నారు.

బిక్కుబిక్కుమంటూ రాకపోకలు

శ్రీవారి దివ్య క్షేత్రానికి నిత్యం వేలాది మంది యాత్రికులు రాష్ట్ర నలుమూలల నుంచి వస్తున్నారు. అందులో అధిక శాతం మంది ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. ఇక్కడి ఆర్టీసీ బస్టాండ్ యాత్రికులకు సమస్యగా మారింది. వీధి కుక్కలు బస్టాండ్‌లోనే తిరుగుతూ, అక్కడే పడుకుంటున్నాయి. యాత్రికులు వాటిని దాటుకుని వెళ్లేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. బుధవారం వేలాది మంది భక్తులు శ్రీవారి దర్శనానంతరం తిరుగు ప్రయాణంలో బస్టాండ్‌కు చేరుకున్నారు. బస్టాండ్‌లో పడుకున్న శునకాల మధ్యలోంచే వారు సంచరించాల్సి వచ్చింది. కొందరు మహిళలు, పిల్లలు అవి ఎక్కడ దాడి చేస్తాయోనని భీతిల్లారు. బిక్కుబిక్కుమంటూ అడుగులు ముందుకు వేశారు. ఇదేం బస్టాండ్‌రా.. దేవుడా అంటూ ఆ గోవిందుడికి దండం పెట్టుకున్నారు.

శునకాల వద్ద దుర్వాసన

శరీరమంతా పండ్లు, దుర్వాసనతో వైరస్ సోకిన శునకాలు ప్రయాణికుల మధ్య తిరుగుతున్నాయి. దీంతో వారు విస్తుపోతున్నారు. అవి కరిస్తే పరిస్థితి ఏమిటా అని ఆందోళన చెందుతున్నారు. ప్రముఖ క్షేత్రంలోని బస్టాండ్ ఇంత దారుణంగా ఉంటే ఎలా అని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్లాట్‌ఫామ్‌లే దిక్కు

ప్రస్తుతం బస్టాండ్‌లో ఉన్న కుర్చీలు యాత్రికులకు చాలడం లేదు. కొందరు ప్లాట్‌ఫామ్‌ల పైనే కుర్చుంటున్నారు. ఎక్కువ సేపు నిలబడలేని వృద్ధులు, మహిళలకు ప్లాట్‌ఫామ్‌లే దిక్కవుతున్నాయి. సరైన తాగునీరు కూడా లేదని పలువురు మండిపడుతున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ప్రభుత్వం, బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందని యాత్రికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు వీధి కుక్కల బెడద తొలగించడంతో పాటు, సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలని యాత్రికులు కోరుతున్నారు.



బస్టాండ్‌లో సంచరిస్తున్న వైరస్ సోకిన శునకం

మరీ ఇంత దారుణమా!



క్షేత్రంలోని బస్టాండ్‌లో పరిస్థితి మరీ ఇంత దారుణంగా ఉంటుందని అనుకోలేదు. పడుకున్న వీధి కుక్కల మధ్య లోంచి తిరగాల్సి వస్తోంది. అవి కరిస్తే పరిస్థితి ఏమిటి. కొన్ని కుక్కలకు వైరస్ ఉంది. వాటిని చూస్తుంటేనే కడుపులో తిప్పుతోంది. ఆర్టీసీ అధికారులకు ఇవి కనిపించవా.

– అంబటి గంగాధరరావు, నరసాపురం, యాత్రికుడు

సౌకర్యాలు కల్పించాలి



బస్టాండ్‌లో కుర్చీలు చాలక చాలామంది ప్లాట్‌ఫామ్‌లపై కుర్చున్నారు. సరైన తాగునీరు కూడా లేదు. ఇక్కడ బస్టాండ్‌లో ఇలాంటి పరిస్థితులు ఉండటం దారుణం. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే చాలదు. సరైన సౌకర్యాలు కూడా కల్పించాలి. ఆ దిశగా అధికారులు దృష్టి సారించాలి.

– పిట్టి కోటేశ్వరరావు, బాపట్ల, ప్రయాణికుడు

ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం

జంగారెడ్డిగూడెం: స్థానిక చత్రపతి శివాజీ త్రి శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ ఎన్ ప్రసాద్ బాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో ఉన్న పిచ్చి మొక్కలు, ఇతర వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగ అధిపతి గాళ్ల శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎం మధు తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం మల్లేశ్వరరావు అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ డేను ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.శ్రీనివాసరావు జాతీయ సేవా పథకం ఆవిర్భావం, లక్ష్యాలు, విధులు, వలంటీర్స్ చేయాల్సిన కార్యక్రమాలను వివరించారు. అధ్యాపకులు ఎం ఉషారాణి, కె.ఇందిరాకుమారి, ధారావతు మల్లేష్, బి.రాజు, పి.ఏడుకొండలు, ఎం.విజయ కృష్ణ పాల్గొన్నారు.



కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

స్తంభాలకు అల్లుకున్న తీగలు

కొయ్యలగూడెం: జాతీయ ప్రధాన రహదారిలో కొయ్యలగూడెం నుంచి బయ్యన్నగూడెం వరకు మధ్యలోనే ఉన్న విద్యుత్ స్తంభాలకు వివిధ రకాల తీగలు అల్లుకొని ఉన్నాయి. అయితే విద్యుత్ సరఫరా ట్రిప్ అవుతోందని, తరచూ వ్యవసాయానికి సాగునీరు సరఫరా లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు చెబుతున్నారు.

స్తంభాలకు అల్లుకున్న తీగలు →



డ్రోన్ స్ప్రేయింగ్‌తో ఉపయుక్తం

పోలవరం రూరల్: డ్రోన్ ద్వారా స్ప్రేయింగ్ చేయడం వల్ల ఎన్నో రకాల ఉపయోగాలు ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.రాంబాబు అన్నారు. పోలవరం మండలం కొత్తపట్టిసీమ గ్రామంలో 80 శాతం రాయితీతో డ్రోన్ పైలెట్‌ను రైతులకు గూటాల కెనరా బ్యాంకు సహకారంతో అందజేశామని ఏఓ తెలిపారు. డ్రోన్ ఖరీదు రూ. 9.80 లక్షలు కాగా, 80 శాతం సబ్సిడీ ఇచ్చామన్నారు. డ్రోన్‌తో 5 నిమిషాల్లో ఎకరం చేలో స్ప్రేయింగ్ చేయవచ్చని, సమయం, డబ్బు ఆదా అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్; నాయకులు మజ్జి ఆంజనేయ స్వామి, పూడి వెంకటరావు, కరిబండి నాగరాజు, డోకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపట్టిసీమలో రైతులకు డ్రోన్లు అందజేస్తున్న దృశ్యం

స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ పరిధి గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేస్తున్న నలుగురు స్కూల్ అసిస్టెంట్లను హెచ్ఎంలుగా పదోన్నతి కల్పించినట్టు ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ తెలిపారు. బోడిగూడెం, మర్రిగూడెం, తెల్లంవారిగూడెం, కోయరాజమండ్రి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు వీరిని హెచ్ఎంలుగా నియమించామన్నారు. వీరికి నియామక పత్రాలను బుధవారం పీఓ అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీడీ ఎస్ శ్రీవిద్య, సూపరింటెండెంట్ కె.సృజన, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రం అందిస్తున్న పీఓ

జీవించే హక్కును హరిస్తున్న ప్రభుత్వం

చింతలపూడి : ఆదివాసులు జీవించే హక్కును రాష్ట్ర ప్రభుత్వం కాలరాయాలని చూస్తోందని పౌర హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పిడపర్తి ముత్తారెడ్డి ఆరోపించారు. బుధవారం చింతలపూడిలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ఆయుధ కర్మాగారం కోసం బుట్టాయిగూడెం మండలంలో ఆదివాసులకు చెందిన పోడు భూములను బలవంతంగా ప్రభుత్వం సేకరిస్తుందన్నారు. ఆదివాసులు శాంతియుతంగా ప్రభుత్వ చర్యలకు నిరసనగా ఉద్యమం చేస్తుంటే పోలీసులు వారి పట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆదివాసులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఆదివాసులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

అన్నప్రసాద వితరణ

జంగారెడ్డిగూడెం: స్థానిక అశ్వారావుపేట రోడ్డులోఉన్న వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద బుధవారం అన్నప్రసాద వితరణ చేశారు. సాయి స్ఫూర్తి ఆసుపత్రి యాజమాన్యం, గారపాటి రాంప్రసాద్, గంగాభవానీ సహకారంతో సుమారు 2700 మంది స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారని అన్నప్రసాద వితరణ కమిటీ సభ్యులు తెలిపారు. కాగా బుధవారం గణపతిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు చేశారు.

దోపిడీకి గురవుతున్న ప్రజలు

వేలేరుపాడు: సత్యశోధక్ సమాజ్ ఏర్పడి 152 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఏలూరు జిల్లా నాయకులు సిరికొండ రామారావు అధ్యక్షతన కుల నిర్మూలన, ఆచర్ణాత్మక కార్యక్రమంలో భాగంగా సదస్సు నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే గౌస్ పాల్గొని మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే కుల వ్యవస్థ నిర్మూలనకు 1873 సెప్టెంబర్ 24న సత్యశోధక సంస్థను ఏర్పాటుచేశారని తెలిపారు. ప్రధాని మోదీ అనుసరిస్తోన్న విధానాల కారణంగా ప్రజలు దోపిడీకి గురవుతున్నారని చెప్పారు. అనంతరం దళితులతో కలిసి పార్టీ శ్రేణులు సహపంక్తి భోజనాలు చేశారు. నాయకులు జి.ముత్యాలరావు, కట్టా ముత్యాలరావు, కట్టడం రాంబాబు, సోడె విజయ, కరటం రత్తమ్మ, ఎస్‌కే మున్ని, ఆశి లక్ష్మయ్య పాల్గొన్నారు.

అనుమతి మేరకే పొగాకు పండించాలి

జంగారెడ్డిగూడెం: 2025–26 పంట కాలానికి ఆంధ్రప్రదేశ్‌లో 142 మిలియన్ కేజీలు, బేరన్‌కు 1.4 హెక్టార్ విస్తీర్ణం అనుమతి ఇచ్చినట్టు వర్జీనియా పొగాకు బోర్డు 1వ వేలం కేంద్రం నిర్వహణాధికారి బి.శ్రీహరి బుధవారం పేర్కొన్నారు. రైతులు నారుమడి పెంపకానికి పొగాకు బోర్డు నుంచి రిజిస్ట్రేషన్ పొందాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఉన్న నర్సరీల నుంచి మాత్రమే నారు కొనుగోలు చేసి, పొగాకు నాట్ల సమయంలో బోర్డు అందిస్తున్న ఫారం–2తో పాటు నారు అమ్మిన నర్సరీ యజమాని ఇచ్చిన రశీదును జత చేసి, సంబంధిత అధికారులకు అందజేయాలని పేర్కొన్నారు.

వేలం ఆదాయం రూ.10.38 లక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లా ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో నిర్బంధ వాహనాలకు బుధవారం వేలం నిర్వహించారు. 7 గూడ్స్ క్యారియర్లు, 1 మ్యాక్సీ క్యాబ్, 1 కాంట్రాక్టు క్యారేజ్ బస్సు, 3 ఆటో రిక్షాలు, 1 ట్రాక్టర్, 1 ట్రైలర్ 6 మోటార్ సైకిల్స్‌ను రోడ్డువర్తి, స్క్రాప్ వేలం నిర్వహించగా రూ.10. 38 లక్షల ఆదాయం రవాణా శాఖకు లభించిందని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ తెలిపారు.

అన్నపూర్ణా దేవిగా అమ్మవార్ల దర్శనం

ద్వారకాతిరుమల: దసర ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అమ్మవారు రోజుకో ప్రత్యేక అలంకారంలో భక్తులను కటాక్షిస్తున్నారు. బుధవారం మూడో రోజు శ్రీవారి క్షేత్ర దేవత కుంకుళ్లమ్మవారు శంకు చక్రాలు ధరించి, పరమేశ్వరుడికి అన్నప్రసాదాన్ని అందిస్తున్న అన్నపూర్ణాదేవిగా పూజలు అందుకున్నారు. వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు గాయత్రి దేవిగా దర్శనమిచ్చారు. పురోహితులు కుంకుమ పూజలు చేశారు. రాజరాజేశ్వరి ఆలయం, పోలీస్‌స్టేషన్ సమీపంలో, విర్త్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న వెంచర్‌లో కొలువుదీరిన అమ్మవార్లు పూజలందుకున్నారు.

అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ

లింగపాలెం : మండలంలోని ధర్మాజీగూడెం కనకదుర్గమ్మవారు అన్నపూర్ణదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. శివాలయం కనకదుర్గమ్మ వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం పట్టణంలో..

జంగారెడ్డిగూడెం: దసరా శరన్నవరాత్రి సంబరాల్లో భాగంగా జంగారెడ్డిగూడెం ప్రజల ఇలవేల్పు గంగానమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పుష్పయాగం నిర్వహించారు. తొలుత మహిళలు పుష్పాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ముత్యాలమ్మవారు గాయత్రిదేవి అలంకరణలో పూజలు అందుకున్నారు. గురవాయగూడెం అయ్యప్ప స్వామి ఉపాలయంలో జ్ఞాన సరస్వతి అమ్మవారికి ట్రస్ట్ సభ్యులు పట్టు వస్త్రాలు అందజేశారు. వాసవి కన్యకా పరమేశ్వరి కాశీ అన్నపూర్ణాదేవిగా, నూకాలమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో పూజలందుకున్నారు. నూకాలమ్మకు 108 కిలోల బియ్యంతో అభిషేకించారు. అమ్మవారి వెండి చీర తయారీకి నులకాని వెంకటేశ్వరరావు దంపతులు 5 తులాల వెండిని సమర్పించినట్లు రాజన పండు తెలిపారు. జెడ్పీహైస్కూల్ వద్ద ఉన్న కనకదుర్గమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు.

కొయ్యలగూడెం మండలంలో..

కొయ్యలగూడెం: కన్నాపురంలోని విజయలక్ష్మీ కనకదుర్గమ్మకు అన్నాభిషేకం నిర్వహించారు. సరిపల్లిలో అమ్మవారి విగ్రహాన్ని అభిషేకించి శివలింగాకృతిలో దీపాలంకరణ చేశారు. కొయ్యలగూడెంలోని కనకదుర్గమ్మ లలితా దేవిగా, త్రిశక్తి పీఠంలోని వాసవీమాత గాయత్రీ దేవిగా, వై జంక్షన్ కనకదుర్గమ్మ అన్నపూర్ణగా పూజలు అందుకున్నారు. రాజవరం మెయిన్ సెంటర్‌లోని కనకదుర్గమ్మకు భవానీలు పూజలు చేశారు. బయ్యనగూడెం, గవరవరం, పొంగుటూరు, అచ్యుతాపురం, దిప్పకాయలపాడు గ్రామాల్లో కనకదుర్గమ్మ ఆలయాలు మహిళా భక్తులతో కిటకిటలాడాయి.

లోకమాతా... నమో నమామి

బుట్టాయగూడెం: దేవీ నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రెడ్డిగణపవరం, బుట్టాయగూడెం త్రిశక్తిపీఠం, శివాలయంలోని త్రిపుర సుందరీ దేవి ఆలయం, ముప్పినవారిగూడెం సమీపంలో కడియలమ్మ ఆలయం వద్ద, కొత్తపేట వద్ద ఏర్పాటు చేసిన ప్రతిమలకు పూజలు చేశారు. గుబ్బల మంగమ్మ తల్లి గాజుల అలంకరణలో పూజలు అందుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

అన్నపూర్ణగా దుర్గమ్మ

పోలవరం రూరల్: కనకదుర్గమ్మ అన్నపూర్ణాదేవిగా పూజలు అందుకున్నారు. అమ్మవారికి కుంకుమ, పూలతో అభిషేకం చేశారు. అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.



కొయ్యలగూడెం : సరిపల్లి కనకదుర్గమ్మ



జంగారెడ్డిగూడెం : పుష్పాల గ్రామోత్సవం



బుట్టాయగూడెం : గుబ్బల మంగమ్మతల్లి



జంగారెడ్డిగూడెం : ముత్యాలమ్మ




ద్వారకాతిరుమల : కుంకుళ్లమ్మ



ద్వారకాతిరుమల : వాసవీమాతకు హారతి



జంగారెడ్డిగూడెం : నూకాలమ్మ



జంగారెడ్డిగూడెం : కనకదుర్గమ్మ



కొయ్యలగూడెం : కన్నాపురం కనకదుర్గమ్మ



జంగారెడ్డిగూడెం : వాసవీ కన్యకాపరమేశ్వరి



జంగారెడ్డిగూడెం : గుర్వాయిగూడెం జ్ఞానసరస్వతి



జంగారెడ్డిగూడెం : గంగానమ్మ



లింగపాలెం : ధర్మాజీగూడెం కనకదుర్గమ్మ